






డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్, పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ
- పోలింగ్ కేంద్రాలకు తరలించిన ఈవీఎంలు
- బందోబస్తు మధ్య గ్రామాలకు చేరిన పోలింగ్ అధికారులు

మధిర, నవంబర్ 29 : ఎన్నికల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పోలింగ్‌ను సజావుగా నడిపించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. మధిర పాలిటెక్నికల్ కళాశాలలో మధిర అసెంబ్లీ ఎన్నికల సంబంధించిన ఈవీఎంతో పాటు, సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అధికారులు తప్పనిసరిగా వ్యవహరించాలన్నారు. ఓటర్లను ఇబ్బందులు పెట్టకుండా వారి వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకొని ఓటు హక్కును కల్పించాలా లేదా అనే విషయాన్ని తెలుసుకొని ఓటును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగించాలని తెలిపారు. పార్టీలకు సంబంధించిన ఏజెంట్లకు పాస్‌లను మంజూరు చేయాలని, ఈవీఎంల సంబంధించిన అవగాహన కల్పించి వారి ఎదుటే వాటిని సీల్ చేయాలని సూచించారు. సీపీ విష్ణు వారియర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారుల అనుమతి పొందిన వారిని మాత్రమే అనుమతిస్తామని, పోలింగ్ కేంద్రాల బందోబస్తుకు మన తెలంగాణ పోలీసు ఉండరని, వారికి ఎన్నికల సిబ్బంది సహకరించాలన్నారు. గుర్తింపు పొందిన ఐడీ కార్డులు పొందిన వారు మాత్రమే పోలింగ్ కేంద్రాలకు అనుమతించడం జరుగుతుందన్నారు. ఆర్వో జీ.గణేశ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

మధిర, నవంబర్ 29 : ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను, సంబంధిత సామగ్రిని నియోజకవర్గంలోని 268 పోలింగ్ కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తు మధ్య తరలించారు. తొలుత మధిరలో పాలిటెక్నికల్ కళాశాలలో పీవోలకు, ఏపీవోలతో పాటు, సిబ్బందికి మధిర ఆర్వో జీ.గణేశ్ అవగాహన కల్పించారు. ఈవీఎంలను ఏ విధంగా ఉపయోగించాలి, ఏ సమయంలో దానిని కంట్రోల్ చేయాలి అనే విషయాలను బుక్‌లెట్‌లో ఉంటుందని, దానిని అనుసరించి పోలింగ్ అధికారులు వ్యవహరించాలన్నారు. అనంతరం స్ట్రాంగ్‌రూంలో ఉన్న ఈవీఎంలతో పాటు, సామగ్రిని పీవోలకు, ఏపీవోలకు అందజేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



చింతకానిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

చింతకాని, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 49 కేంద్రాలను ఏర్పాటు చేసి 5 రూట్లుగా విభజించారు. వీటికి 196 మందిని నియమించి మరో 20 మందిని అదనపు సిబ్బందిగా కేటాయించారు. మండలంలో ఓటర్ల మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఓటరు ఏ విధంగా ఓటును సద్వినియోగం చేసుకోవాలి అనే విషయంపై ప్రత్యేకంగా అధికారులను ఓటర్లకు అవగాహన కల్పించారు.





స్ట్రాంగ్‌రూం నుంచి ఈవీఎంలను తీసుకొస్తున్న సిబ్బంది, ఈవీఎంలను పరిశీలించుకుంటున్న పీవోలు



## అందుబాటులో ఉండే నాయకుడికే మా ఓటు

### బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజుపై ఓటర్ల సానుభూతి



మధిర మండలంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు

మధిర, నవంబర్ 29 : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడికే నియోజకవర్గంలోని బడుగు, బలహీన వర్గాలతో పాటు, రైతాంగం, యువకులు స్వచ్ఛందంగా గ్రామాల్లో ఓట్లు వేస్తామంటూ ఓటర్లు ప్రతిజ్ఞలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. పేదవాడు, సౌమ్యుడు, విధేయుడుగా ప్రజలకు సేవలు అందించి ప్రజాక్షేత్రంలో నిలిచిన లింగాల కమల్‌రాజుకు ఓటు వేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ బహిరంగంగా ఓటర్లు ముక్తకంఠంతో వారి అభిప్రాయాలను వెళ్లబుచ్చుతున్నారు. ఆర్థికంగా బలంగా లేనప్పటికీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన చేసిన కృషి వెలకట్టలేదని ఓటర్లు భావిస్తున్నారు. ఎవరైనా ఓటర్లను డబ్బుతో ప్రభావితం చేసినప్పటికీ ఓటు మాత్రం కమల్‌రాజుకు వేయాలన్న సంకల్పంతో ఓటును వినియోగించుకోబోతున్నారు.



బోనకల్లు మండలంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు

## పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు

ముదిగొండ, నవంబర్ 29 : అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలను తోరణాలు కట్టి గ్రీన్ కార్పెట్‌తో ముస్తాబు చేశారు. మండల పరిధిలో 55 పోలింగ్ కేంద్రాలు ఉండగా అయిదు కొత్తగా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 500 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. మెడికల్ సిబ్బంది, వృద్ధుల కోసం వలంటీర్స్‌ను ఏర్పాటు చేశారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సివిల్, మధ్యప్రదేశ్ పోలీసులు, కేంద్ర బలగాల సిబ్బంది 180 మందిని నియమించారు. వీరు కాక ఇద్దరు సీఐలతో రెండు స్ట్రైకింగ్ ఫోర్స్, ఏసీపీతో అదనపు స్ట్రైకింగ్ ఫోర్స్ అందుబాటులో ఉంటుంది. 11 సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకూ మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. అయిదు తురువాత పోలింగ్ కేంద్రం లోపల ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ ముగిసిన తరువాత ఈవిఎంలు మధిర ఆర్వో కార్యాలయానికి తరలించి అక్కడి నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించనున్నారు.




## వైరా నియోజకవర్గంలో 1,93,069 మంది ఓటర్లు

వైరా టౌన్, నవంబర్ 29 : నియోజకవర్గంలోని 193069 మంది ఓటర్లు ఉండగా, అందులో 94057 మంది పురుషులు, 99005 మహిళా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలాలవారీగా ఏన్కూరు మండలంలో పురుషులు 13249, మహిళలు 14248 మంది, జూలురుపాడు మండలంలో 13614 మంది పురుషులు, 14018 మహిళా ఓటర్లు, కొణిజర్ల మండలంలో పురుషులు 23798 మంది, మహిళలు 25027 మంది, సింగరేణి మండలంలో పురుషులు 22176 మంది, మహిళలు 22832 మంది, వైరా మండలంలో పురుషులు 21220 మంది, మహిళలు 22880 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరితో పాటు ఇతరులు ఏడుగురు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పలు మండలాల్లో మోడల్ ఎన్నికల బూత్‌లను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 5.30 గంటలకు మార్క్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్‌ను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## మధిర నియోజకవర్గంలో 2,21,326 మంది ఓటర్లు

మధిర, నవంబర్ 29 : మధిర అసెంబ్లీ స్థానంలో ఎన్నికల కమిషన్ ఓటర్ల లెక్కను తేల్చింది. గురువారం జరగబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలోని మధిర, బోనకల్లు, ఎర్రుపాలెం, చింతకాని, ముదిగొండ మండలాల్లో 268 పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. మొత్తం ఓటర్లు 2,21,326 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోబోతున్నారు. వీరిలో పురుషులు 1,07,111 మంది, మహిళలు 1,14,206 మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 7092 మంది ఓటర్లు అధికంగా ఉన్నారు. మరో 9 మంది ఇతరులు ఉన్నారు. ముదిగొండలో 1వ పోలింగ్ స్టేషన్ నుంచి 55వ పోలింగ్ స్టేషన్ వరకు 48,157 మంది ఓటర్లు ఉండగా వీరిలో 23,197 మంది పురుషులు, 24,958 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. చింతకాని మండలంలో 56వ పోలింగ్‌స్టేషన్ నుంచి 104 పోలింగ్‌స్టేషన్ పరిధిలో 41,057 ఓటర్లు ఉండగా వీరిలో 19,698 మంది పురుషులు, 21,367 మంది మహిళలు, బోనకల్లు మండలంలో 105 పోలింగ్‌స్టేషన్ నుంచి 144 పోలింగ్‌స్టేషన్ పరిధిలో 35,835 ఓట్లు ఉండగా 15,483 పురుషులు, 18,351 మంది మహిళలు, ఒకరు ఇతరు ఉన్నారు. మధిర మండలంలోని 145 పోలింగ్‌స్టేషన్ నుంచి 214 పోలింగ్‌స్టేషన్ పరిధిలో 56,669 ఓటర్లు ఉండగా వీరిలో 27,330 పురుషులు, 29,334 మహిళలు, 5 మంది ఇతరులు, ఎర్రుపాలెం మండలంలో 215 పోలింగ్‌స్టేషన్ నుంచి 268 పోలింగ్‌స్టేషన్ వరకు 39,608 ఓటర్లు ఉండగా వీరిలో 19,411 పురుషులు, 20,196 మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు. ఇప్పటికే ఓటర్లకు ఎలక్షన్ కమిషన్ గ్రామాల వారీగా ఓటును వినియోగించుకునేందుకు పోల్ స్లిప్‌ను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఓటర్లు 30న ఓటును వినియోగించుకోనున్నారు.